

## వరద కాలువకు గండి



2



2

## చెడు వ్యసనాలకు బానిస కావొద్దు



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## రెండో శనివారం సైతం మద్యం దుకాణాలకు దరఖాస్తులు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాల కోసం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో ప్రాంతాల వారీగా దరఖాస్తులు తీసుకునేందుకు కౌంటర్లను సైతం ఏర్పాటు చేశారు. అదేవిధంగా రెండో శనివారం సెలవు అయినప్పటికీ ఈనెల 11వ తేదీన దరఖాస్తులు స్వీకరించనున్నమాని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం ఎస్‌హెచ్‌వో 8712658973ను సంప్రదించవచ్చని ఆయన సూచించారు.





## ప్రాజెక్ట్‌లకు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం 59,774 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 16 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన, స్థానికంగా వర్షాలు తగ్గడంతో ప్రాజెక్ట్‌లోకి వరద తగ్గింది. జలాశయంలో 59,774 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. వరద గేట్ల ద్వారా 49,984 క్యూసెక్కులు గోదావరిలోకి వదులుతున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, కాకతీయ కాలువకు 4 వేలు, సరస్వతి కాలువకు 650, లక్ష్మి కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్‌లోకి ఎగువ నుంచి 41,680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం అంతేమొత్తం నీటినిల్వతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది. వరద గేట్ల ద్వారా 40,680 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు వెయ్యి క్యూసెక్కులు వదులుతున్నారు. అలాగే పోచారం డ్యాంలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తోంది.

## నగరంలో ముగ్గురు బాలికల మిస్సింగ్ కలకలం..



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలో ముగ్గురు బాలికల మిస్సింగ్ కలకలం రేపుతోంది. కోటగల్లి బాలికల పాఠశాలలో ఉన్న వెనకబడిన తరగతుల వసతి గృహం నుంచి ముగ్గురు బాలికలు తప్పిపోయినట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం నుంచి వారు కనిపించకుండా పోయారని సమాచారం. పదో తరగతికి చెందిన ఇద్దరు, తొమ్మిదో తరగతికి చెందిన ఓ విద్యార్థిని హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని సమాచారం. బయటకు వెళ్లిన విద్యార్థులు తిరిగి హాస్టల్‌కు రాకపోవడంతో విషయాన్ని వసతిగృహ అధికారులు ఆలస్యంగా గుర్తించినట్లు సమాచారం. వెంటనే వారు పోలీసులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వసతి గృహంలోని సీసీ కెమెరాలను పరిశీలించినట్లుగా తెలిసింది. ఈ మేరకు తల్లిదండ్రులు ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గ్యాస్ సిలిండర్‌లో నీరు..!



**అక్షరటుడే, ఇందల్వాయి:** వంటగ్యాస్ సిలిండర్ బుక్ చేస్తే సదరు సిలిండర్‌లో గ్యాస్‌కు బదులు నీరు రావడంతో వినియోగదారు అవాక్కయిన ఘటన ఇందల్వాయిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఇందల్వాయికి చెందిన పార్వతి వంట గ్యాస్ సిలిండర్ అయిపోవడంతో బుక్ చేసింది. డెలివరీ బాయ్ ఇంటికి సిలిండర్ డెలివరీ చేసి వెళ్లాడు. అనంతరం పార్వతి సిలిండర్ బిగించి, స్టవ్ వెలిగించగా మంట రాలేదు. దీంతో అనుమానం వచ్చిన సిలిండర్‌ను పరిశీలిస్తే పూర్తిగా నీటితో నిండి ఉన్నట్లు గుర్తించింది. ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహకులు ఇలా నిర్లక్ష్యంగా సిలిండర్ డెలివరీ చేయడంపై మండిపడింది. అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించింది.



# అభ్యర్థుల ఆశలపై నీళ్లు

**స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడింది. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ పై ఇచ్చిన జీవో 9పై హైకోర్టు స్టే విధించింది. దాంతో ఎన్నికల్లో పోటీ చేయాలని భావించిన అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం అత్యధికంగా బీసీలు పోటీ చేసే అవకాశం లభించింది. ఉమ్మడి జిల్లాలో రిజర్వేషన్ ప్రకారం పోటీ చేయాలనుకునే అభ్యర్థుల్లో హైకోర్టు తీర్పుతో నిరుత్సాహం నెలకొంది. ఈ క్రమంలో వాట్ నెక్స్ట అనే ప్రశ్న అందరి మదిని తొలిచివేస్తోంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి/ఇందూరు**

▸ హైకోర్టు తీర్పుతో స్థానిక ఎన్నికలకు బ్రేక్ ▸ ఆశావహుల్లో నైరాశ్యం.. ▸ పోటీపై పునరాలోచన

ఎంతో కాలంగా వేచి చూస్తున్న స్థానిక సంస్థల సమరానికి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇక ఎన్నికల బరిలోకి దిగడమే తరువాయి అనుకున్న అభ్యర్థులకు హైకోర్టు షాక్ ఇచ్చింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై స్టే విధించింది. దీంతో స్థానిక సంస్థల్లో పోటీ చేయాలని ఉవ్విళ్లూరిన వారికి నిరాశే మిగిలింది. ఇప్పటికే గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతూ, ప్రజలతో మమేకమవుతూ స్థానిక పోరుకు సన్నద్ధమైన ఆశావహులు.. కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఢీలా పడిపోయారు. మరో రెండు నెలల వరకు ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగే పరిస్థితి లేకపోవడంతో నిరాశలో కూరుకుపోయారు.

### అన్ని ఏర్పాట్లు..

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇటీవల షెడ్యూల్ విడుదల కావడంతో ఆశావహులు ఉత్సాహంగా రంగంలోకి దిగారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీగా పోటీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఎంపీటీసీగా, సర్పంచ్‌గా పోటీ చేయాలన్న ఆసక్తి ఉన్న వారు.. పల్లెల్లో ముఖ్యమైన వారిని, బలమైన నేపథ్యం ఉన్న వారిని మచ్చిక చేసుకున్నారు. కుల సంఘాల నేతలతోనూ మంతనాలు జరిపారు. మరోవైపు, గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల దసరా, బతుకమ్మ పండుగలకు వాడవాడలా ఫ్లెక్సీలు పెట్టించి హల్ చల్ చేశారు. మరోవైపు, ఎన్నికలకయ్యే వ్యయాన్ని భరించేందుకు ఆర్థికంగా కూడా సంసిద్ధమయ్యారు. సర్పంచ్ పదవిపై కన్నేసిన చాలా మంది లక్షలాది డబ్బును సిద్ధంగా ఉంచుకున్నారు. ఇప్పటికే పలుచోట్ల విందు సమావేశాలకు తెర లేపారు.

### షాక్ ఇచ్చిన హైకోర్టు..

షెడ్యూల్‌తో పాటు నోటిఫికేషన్ వెలువడడంతో ఆశావహుల్లో ఎనలేని ఉత్సాహం నెలకొంది. ఇక నామినేషన్ వేయడమే తరువాయి అనుకుంటున్న తరుణంలో హైకోర్టు అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లించింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు బ్రేక్ వేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే ఇచ్చినట్లయింది. అలాగే విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. పిటిషనర్లందరికీ కౌంటర్ దాఖలు చేయడానికి నాలుగు వారాలు, అనంతరం కౌంటర్ వేయడానికి మరో రెండు వారులు ప్రభుత్వానికి గడువు ఇస్తూ విచారణను వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ తాత్కాలికంగా నిలిచిపోయింది.

### నామినేషన్ల కోసం ఏర్పాట్లు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గురువారం నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నిజామాబాద్ జిల్లాలో మొదటి విడతలో 18 జడ్పీటీసీ, 177 ఎంపీటీసీ, 281 గ్రామాలలో సర్పంచ్ ఎన్నికలు, రెండవ విడతలో 13 జడ్పీటీసీ, 130 ఎంపీటీసీ స్థానాలు, 264 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. కామారెడ్డి జిల్లాలో 14 జడ్పీటీసీ, 136 ఎంపీటీసీ, 266 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు, రెండవ విడతలో 11 జడ్పీటీసీ, 97 ఎంపీటీసీ, 266 గ్రామాల్లో సర్పంచ్ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం పలువురు అభ్యర్థులు అధికారుల నుంచి నామినేషన్ పత్రాలు కూడా తీసుకెళ్లారు. అయితే ప్రస్తుతం అంతా వృథాగా మారింది.

### చేసిన ఖర్చు బూడిద పాలు!

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల్లో పోటీ పక్కా అనుకున్న అభ్యర్థులు ఓటర్లకు దగ్గరయ్యేందుకు ఇప్పటికే రూ.లక్షల్లో ఖర్చు చేశారు. మరికొందరు భూములు అమ్ముకుని, అప్పులు చేసి ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు చేయని ప్రయత్నాలు లేవు. ప్రస్తుతం ఖర్చు చేసిన అభ్యర్థులలో ఆందోళన నెలకొంది. ఇప్పటిదాకా చేసిన ఖర్చు బూడిద పాలైందని సన్నిహితుల ముందు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఎన్నికలు ఏమో గాని అప్పులైతే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని శుక్రవారం విద్యుత్ సరఫరాలో కోత విధించనున్నట్లు ఏడీఈ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వినాయక నగర్ ఉపకేంద్రం నుంచి గాయత్రి నగర్ ఫీడర్ వరకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. ఇందులో భాగంగా అన్నపూర్ణ అపార్ట్‌మెంట్, స్నిగ్ధ అపార్ట్మెంట్స్, సాయిరెడ్డి అపార్ట్మెంట్స్, శ్రీ సాయి అపార్ట్మెంట్, వెంకీ స్కై అపార్ట్మెంట్, సంకట విమోచన హనుమాన్ టెంపుల్, భూలక్ష్మి మాత ఆలయం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

## విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



**అక్షరటుడే, ఇందూరు :** విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఎం.సాయరెడ్డి సూచించారు. నగరంలోని కస్బాగల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సాయరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థి దశ నుండే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్ష, కార్యదర్శులు లింబాద్రి, రాఘవేందర్, కోశాధికారి రాజేందర్, పూర్వాధ్యక్షుడు చింతల గంగాదాస్, ప్రోగ్రాం ఛైర్మన్ యెండల ప్రశాంత్, పాఠశాల ఉపాధ్యాయులు సుజాత, అస్మా జరీన్ పాల్గొన్నారు.

## 13న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

**అక్షరటుడే, ఇందూరు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న జిల్లాస్థాయి అండర్-14 కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. పోటీలు జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ మైదానంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. టోర్నమెంట్లో కేవలం అధికారికంగా ఎంపికైన జోనల్ జట్లు మాత్రమే పాల్గొనాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16న సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన ఉద్యోగ సంఘం నాయకుడు



**అక్షరటుడే, భీమ్‌గల్:** వేల్పూర్ మండలం లక్కోర గ్రామానికి చెందిన సుభాష్ ఇటీవల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందాడు. కాగా.. ఆయన గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నాడు. దీంతో మహేశ్‌కుమార్ గౌడ్ ఆయనకు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘ నాయకుడు సుభాష్ కాంగ్రెస్ పార్టీలో చేరడం హర్షనీయమన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, స్టేట్ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి, సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఏటీసీ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రభుత్వ పాఠశాలలు, ఐటీఐలలో కొనసాగుతున్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చందూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ముఖ గుర్తింపు విధానం ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు నమోదు చేస్తున్నారా అని పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని సూచించారు. డైనింగ్ హాల్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయిన విషయాన్ని గమనించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఆయన వెంట స్థానిక అధికారులు, ఐటీఐ నిర్వాహకులు ఉన్నారు.



## విద్యుత్ ప్రమాదాల నియంత్రణపై అవగాహన



**అక్షరటుడే, కోటగిరి:** విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రుద్రూర్ ఏడీఈ తోట రాజశేఖర్ సూచించారు. పోతంగల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటి డాబాలపై వైర్లు కట్టి బట్టలు ఆరేయవద్దని సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకవద్దని వివరించారు. వర్షం కురిసిన సమయంలో విద్యుత్ స్తంభాలు, ఎలక్ట్రిక్ వస్తువులు, చెట్ల కొమ్మలను తాకకూడదని చెప్పారు. అలాగే ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే కాపాడాలనే తొందరలో ఆ వ్యక్తిని ముట్టుకోవద్దని, పొడి కర్ర ఉపయోగించాలన్నారు. విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని, తడి బట్టలను ఇస్త్రీ చేయవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని, దీంతో భూగర్భ జలమట్టం పెరిగి బోరు మోటారుకు విద్యుత్ వాడకం తగ్గించుకోవచ్చన్నారు. విద్యుత్ సంబంధ సమస్యల కోసం 1912 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. అలాగే సోలార్ విద్యుత్ కోసం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, బ్యాంక్ లోన్ సదుపాయం కూడా ఉందన్నారు. అవసరమైనవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోతంగల్ ఏఈ ఫక్రుద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీవాణి నాగనాథ్, ఇందిరా ప్రియదర్శిని, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
2
నిజామాబాద్/కామారెడ్డి
గురువారం
9.10.2025
www.aksharatoday.in
AKSHARA TODAY



## చెడు వ్యసనాలకు యువత బానిసలు కావొద్దు

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని భాగ్‌చంద్ మహారాజ్ పేర్కొన్నారు. మండలంలోని పెద్ద దేవిసింగ్ తండాలో భాగచంద్ బాబా సత్సంగ్‌లో భాగంగా ఆయన ప్రసంగించారు. లభానా సమాజ్ యువత సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని.. వారు చెడు మార్గంలో వెళ్లకుండా కాపాడాల్సిన బాధ్యత వారిదేనన్నారు. గులాజ్‌సింగ్ మహారాజ్ భౌతికంగా మన మధ్య లేకున్నప్పటికీ ఆయన ఆశీస్సులు మనపై ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహారాజ్‌లు, తండా పెద్దలు పాల్గొన్నారు.



## రేపు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు

**అక్షరటుడే, ఇందూరు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్‌లో రాష్ట్రస్థాయి అండర్-14 తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శి నాగమణి వివరాలు వెల్లడించారు. తెలంగాణలోని పాత పది జిల్లాల క్రీడాకారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని వివరించారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో కాలనీలోని ఓ ఇంట్లో పేకాట నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురుని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.23,400 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అశోక్ తెలిపారు. మండల పరిధిలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో 14 మందికి జైలు

**అక్షరటుడే, కామారెడ్డి:** డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో కామారెడ్డి పోలీసులు దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఎక్కడిక్కడ తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తూ, కోర్టులో హాజరు పరుస్తున్నారు. తాజాగా కామారెడ్డి జిల్లాలో 58 మందికి కోర్టు జరిమానాలు విధించింది. ఇందులో 14 మందికి జరిమానాతోపాటు జైలుశిక్ష విధించింది. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురికి, దోమకొండ పరిధిలో ఒకరికి రెండు రోజులు, దేవునిపల్లి పరిధిలో ఆరుగురికి, మాచారెడ్డి, కామారెడ్డి, భిక్కనూరు పరిధిలో ఒక్కొక్కరికి ఒకరోజు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. అలాగే కామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో 14 మంది, రామారెడ్డి పరిధిలో ఒకరికి, దేవునిపల్లి పరిధిలో 20 మంది, భిక్కనూరు పరిధిలో ఒకరు, దోమకొండ పరిధిలో ఆరుగురు, రాజంపేట, సదాశివనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున మొత్తం 44 మందికి రూ.44 వేల జరిమానా విధించింది.


## డీసీఎం డ్రైవర్‌కు జైలుశిక్ష

**అక్షరటుడే, ఆర్మూర్:** డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ డీసీఎం డ్రైవర్‌కు న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా.. మద్యం తాగి డీసీఎం నడుపుతున్న డ్రైవర్‌ను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం అతడికి కౌన్సెలింగ్ చేసి ఆర్మూర్ కోర్టులో గురువారం ప్రవేశపెట్టారు. విచారించిన సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఏడురోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## శతాధిక వృద్ధురాలు కన్నుమూత



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండల కేంద్రానికి చెందిన తెనుగు పెద్దవ్వ (102) బుధవారం రాత్రి వయోభారంతో కన్నుమూసింది. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. పెద్దవ్వ గ్రామంలో అందరికీ పెద్దదిక్కుగా ఉండేదన్నారు. ఈ వయస్సులో కూడా అన్ని పనులు తనంతట తానే చేసుకునేదని గుర్తు చేసుకున్నారు. ఆమె మృతివార్త తెలుసుకున్న గ్రామ ప్రజలు, బంధువులు నివాళులర్పించారు.





## వరద కాలువకు గండి.. కొట్టుకుపోయిన పంటలు..

వరద కాలువకు గండిపడి పొలాలు కొట్టుకుపోయాయి. మోర్తాడ్ మండలం గాండ్లపేట్ వద్ద వరద కాలువకు మోర్తాడ్ మండలంలో గురువారం ఉదయం గండిపడింది. దీంతో భారీగా నీరు వృథా అవుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వెంటనే మోర్తాడ్ తహశీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. వాగు వెంబడి గాండ్లపేట గ్రామంలోని ఎస్సీ, బీసీ పేదల పొలాలు ఉంటాయని, వరద కాలువకు గండి పడి నీరు పెద్దవాగులోకి వస్తుండడంతో వాగు ఒడ్డు కోతకు గుర్రై పంట పొలాలు ఇసుక మేటలు వేశాయని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారి సహకారంతో జరిగిన పంట నష్టం లెక్కలు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని తహశీల్దార్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.

- అక్షరటుడే, ఆర్మూర్

## ఆరు గ్యారంటీల హామీలతో మోసం: మాజీ ఎమ్మెల్యే జాజాల

**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. ఆరు గ్యారంటీల పేరుతో 420 హామీలు ఇచ్చిందని.. వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ బాకీ కార్డుల కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా గురువారం సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల అమలు చేస్తామని 420 హామీలిచ్చిందన్నారు. హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం హామీలను విస్మరించడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.






## స్కూల్‌కి ఫోన్ తెచ్చాడని విద్యార్థికి టీసీ ఇచ్చి ఇంటికి పంపేశారు..!

**అక్షరటుడే, ధర్పల్లి:** స్కూల్‌కు ఫోన్ తీసుకొచ్చాడనే నెపంతో ఓ విద్యార్థికి టీసీ ఇచ్చి ఇంటికి పంపించేశారు. ఈ ఘటన ధర్పల్లి మండలంలో చోటు చేసుకుంది. బంజారా సేవా సంఘం నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుబ్బాక గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గతనెల 20 తేదీన బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చిత్రీకరించేందుకు ఓ విద్యార్థి స్కూల్‌కు ఫోన్ తీసుకెళ్లాడు. దీంతో ఆగ్రహించిన హెచ్‌ఎం ఆ విద్యార్థిని కొట్టి.. దూషించారని సంఘం నాయకులు ఆరోపించారు. అలాగే విద్యార్థికి టీసీ ఇచ్చి.. తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్ పిలిపించారని.. ఇది ఎంతవరకు సమంజసమని సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం సుమారు 30 మంది సల్పబండ తండావాసులు పాఠశాలకు వచ్చి హెచ్‌ఎం నిర్వాకాన్ని ఖండించారు. పాఠశాలకు తరలివచ్చిన వారిలో మాజీ సర్పంచ్ శర్మాన్ నాయక్, తండానాయక్, శంకర్ నాయక్, కారోబార్ బాద్యానాయక్, అమనార్, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అమ్ముకున్న డీలర్..

**అక్షరటుడే, గాంధారి:** లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యంను ఓ రేషన్ డీలర్ దర్జాగా అమ్మేసుకున్నారు. రేషన్‌షాపు నిర్వాహకుల తీరుపై అనుమానం వచ్చిన ప్రజలు.. అధికారులకు ఫిర్యాదు చేయడంతో బండారం బయటపడింది. ఈ ఘటన గాంధారి మండలం గండివేట్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గండివేట్‌లోని ఓ రేషన్ డీలర్ కొన్నిరోజులుగా రేషన్ బియ్యం పంపిణీ చేయట్లేదు. లబ్ధిదారులు అడిగితే రేపుమాపు అంటూ వారు పొంతనలేని సమాధానం చెబుతూ వస్తున్నారు. దీంతో విసిగిపోయిన ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేష్ విచారణ చేశారు. రేషన్ షాప్‌లో మొత్తంగా 218 క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యం మాయమైనట్లు విచారణలో తేల్చారు. తదుపరి చర్యల నిమిత్తం ఆర్డీవోకు నివేదిక అందజేస్తామని ఆయన వివరించారు.




## దేశాభివృద్ధి కోసమే బీజేపీ సంక్షేమ పథకాలు

**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు అన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల శేఖర్ తిరిగి బీజేపీలో చేరగా.. గురువారం బాన్సువాడ బీజేపీ కార్యాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నరాజులు మాట్లాడుతూ.. దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తున్న పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక ప్రజాదరణ పొందిన నాయకుడు పీఎం నరేంద్ర మోదీ అని కొనియాడారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే ప్రజలు బీజేపీ వైపు ఆకర్షితులవుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ అధ్యక్షుడు మజ్జిగ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చీదర్ సాయిలు, కార్యదర్శి శంకర్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా కిషన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి, హనుమాన్ యాదవ్, హరికృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, దత్తు, సీనియర్ నాయకులు సాయిబాబా, దత్తు సాయి రెడ్డి, లక్ష్మణ్, సురేష్, సంజీవ్, విశ్వనాధ్, విఠల్ రాజిరెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## చెరువులో పడి మహిళ మృతి

**అక్షరటుడే, వెబ్ డెస్క్:** ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన గాంధారి మండలం పెద్ద పోతంగల్ గ్రామ శివారులో జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్కి సాయవ్వ(40) భర్త రెండో పెళ్లి చేసుకుని నిజాంసాగర్ లో ఉంటున్నాడు. ఈ క్రమంలో సాయవ్వ గ్రామంలో ఒంటరిగా ఉంటోంది.

బుధవారం రాత్రి బహిర్భూమి కోసం చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలికి ఓ కూతురు ఉండగా, మూడు నెలల క్రితం కోటగిరి పోతంగల్ కు చెందిన వ్యక్తితో వివాహం జరిపించింది. కూతురు సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని 35వ వార్డులో అనారోగ్యంతో చికిత్స పొందిన వ్యక్తికి గురువారం బీజేపీ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు చెక్కును అందించారు. కార్యక్రమంలో ఆర్మూర్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, బీజేపీ సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్, బీజేవైఎం ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్, కత్తి శీను, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.



## ఫోన్‌పేలో ఒకరికి పంపాల్సిన డబ్బులు మరొకరికి..

**అక్షరటుడే, ఆర్మూర్:** ఫోన్‌పేలో ఒకరికి పంపాల్సిన డబ్బులు మరొకరిగా పంపగా.. చివరకు కథ సుఖాంతమైంది.. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 5న హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన గిరి విజయలక్ష్మి అనే మహిళ రూ.66వేలను ఫోన్‌పేలో తన స్నేహితులకు పంపాల్సి ఉండగా మరో నంబర్‌కు పొరపాటున పంపించారు. చివరకు చెక్ చేసుకోగా వేరే నంబర్‌కు డబ్బులు వెళ్లినట్లు గుర్తించి ఆ నంబర్‌కు ఫోన్ చేయగా.. ఆర్మూర్‌కు చెందిన నూతల సత్తమ్మ ఫోన్‌పేకు వెళ్లినట్లుగా గుర్తించారు. అనంతరం బాధితులు హైదరాబాద్ నుంచి నేరుగా గురువారం ఆర్మూర్‌కు వచ్చి ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిని సంప్రదించారు. దీంతో ఆయన వెంటనే సత్తెమ్మను పిలిపించారు. విచారించగా తనకు రూ.66వేలు వచ్చిన మాట వాస్తవమేనని ఆమె ఒప్పుకుని బాధితులకు తిరిగి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి సత్తెమ్మను సన్మానించారు.



## గల్ఫ్ కార్మికుల సమస్యలపై చర్చ

**అక్షరటుడే, ఆర్మూర్ :** ప్రవాసీ భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో గురువారం గల్ఫ్ కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ మేరకు సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడుతో కలిసి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు చర్చించారు. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను న్యాయమూర్తి.. కోటపాటిని అడిగి తెలుసుకున్నారు. వారి కోసం చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలపై జడ్జికి వివరించారు.



## బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ

**అక్షరటుడే, కామారెడ్డి:** రాజంపేట మండలంలో కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ బీఆర్ఎస్‌లో చేరారు. రాజంపేట్ మండలం గుండారం మాజీ ఎంపీటీసీ హాజీ నాయక్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి గురువారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని సూచించారు.